క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ శాఖాధికారులు 33/11 కేవీ విమ్స్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీ సాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తాండ్ర పాపారాయుడికి ఘన నివాళి


పాపారాయుడు విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న సంఘం నాయకులు

బీచ్ రోడ్డు: తాండ్ర పాపారాయుడు 267వ వర్ధంతి సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీచ్‌రోడ్డులోని పాపారాయుడు విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, బర్ల పైడంనాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే స్టీల్‌ప్లాంట్ తలమానికం


మాట్లాడుతున్న షర్మిల

కూర్మన్నపాలెం: ఆంధ్ర రాష్ట్రానికే విశాఖ స్టీల్ ప్లాంట్ తలమానికమని, అటువంటి సంస్థను అమ్మేయాలనుకోవడం దురదృష్టకరమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు నేటి వరకు న్యాయం జరగలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రధానిగా రాహుల్‌గాంధీ రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ మీద సంతకం చేస్తారని, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామనే అంశాన్ని చేర్చుతామని తెలిపారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు సంస్థలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

'గైస్' విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత


ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులతో కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక శాఖ నిర్వహించిన ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు రికార్డు సృష్టించారు. పాలిటెక్నిక్ డిప్లమా పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా 7వ సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. 2020–23 బ్యాచ్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 61 మంది పరీక్షలకు హాజరు కాగా.. 61 మంది ఉత్తీర్ణత సాధించారు. కాలేజీ స్థాపించిన తర్వాత ఇలా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం ఇదే మొదటిసారని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

మహిళ సాధికారతకు 'కొండంత ఆసరా'


స్వయం సహాయ సంఘం సభ్యుల సమావేశం

- పెద్ద ఎత్తున స్వయం సహాయక బృందాలకు ఆర్థిక భరోసా
- తూర్పు నియోజకవర్గంలో 26,736 మందికి లబ్ధి
- 4వ విడతగా రూ.26.91 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వైఎస్సార్ ఆసరా'ద్వారా స్వయం సహాయక బృందాలు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3 విడతల నిధులను మంజూరు చేయగా.. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4వ విడత నిధులను ఆయా స్వయం సహాయక సంఘాలకు విడుదల చేశారు. విశాఖ జిల్లాతో పాటు ప్రస్తుతం విశాఖ తూర్పు నియోజకవర్గంలో పంపిణీ కార్యక్రమం విస్తృతంగా జరుగుతోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా సాధికారత సాధిస్తున్న మహిళల ను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా సంఘాలకు బ్యాంకు రుణాల విముక్తితో పాటు వారి ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా సేవ లు అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 2.59 లక్షల మంది లబ్ధిదారులకు మంచి జరుగుతుండగా.. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 26,736 మంది లబ్ధి పొందుతున్నారు.

తూర్పు పరిధిలో వార్డుల వారీగా వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు

వార్డు	లబ్ధిదారులు	వార్డు	లబ్ధిదారులు
9	1556	18	1306
10	1880	19	1144
11	3177	20	802
12	2301	21	1170
13	2337	22	2552
15	1896	23	1390
16	1778	28	1605
17	1842		

తూర్పు పరిధిలో లబ్ధి రూ.26.91 కోట్లు

తూర్పు నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 26,736 మంది లబ్ధిపొందుతున్నారు. వీరికి ప్రతి విడత రూ.26.91కోట్లు నిధులు ఆర్థిక సాయంగా ప్రభుత్వం అందజేస్తుంది. ప్రస్తుతం నియోజవర్గాల వారీగా ఆయా నిధుల పంపిణీ ప్రక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 11వ వార్డులో ఈ పథకానికి 3177 మంది లబ్ధిదారులు ఉండగా.. 22వ వార్డులో 2552 మంది, 13వ వార్డులో 2337 మంది ఆ తరువాతి స్థానంలో ఉన్నారు. 20వ వార్డులో అత్యల్పంగా 802 మంది లబ్ధిదారులు ఉన్నారు.

ప్రభుత్వ సాయం మరువలేం..



18వ వార్డు అప్పుఘర్‌లో ఉంటున్నాం. శివపార్వతి గ్రూప్ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాం. రుణమాఫీ, సున్నా వడ్డీ, ఆసరా ద్వారా మా కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. ఆసరా ద్వారా ఇప్పటికే మూడు విడతలు అందుకున్నాం. ఇప్పుడు నాలుగో విడత మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఎప్పటికీ ప్రభుత్వ సాయం మరిచిపోలేం.

– చీకటి శారదా, లబ్ధిదారు

మహిళలకు మంచి ఊరట



ప్రభుత్వ అందిస్తున్న పథకాల ద్వారా మహిళలకు మంచి ఊరట లభిస్తోంది. నాకు ఇద్దరు బాబులు. వాళ్లను అమ్మఒడి ద్వారా మంచిగా చదివించుకుంటున్నాను. దానికి తోడు ఆసరా, సున్నా వడ్డీ రుణం వంటి పథకాల ద్వారా ప్రభుత్వం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. దీంతో మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతున్నాం. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వంలో మరింత మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను.

– వి.రమణమ్మ, లబ్ధిదారు

ఫుడ్ సెక్యూరిటీ ఇన్ ఇండియా పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.రవిబాబు

ఏయూ క్యాంపస్: ఫుడ్ సెక్యూరిటీ ఇన్ ఇండియా–ఇష్యూస్ అండ్ చాలెంజెస్ పుస్తకాన్ని బుధవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో కలిసి శాసన మండలి సభ్యుడు కె.రవిబాబు ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు సంపాదకత్వం వహించారు. 24 మంది రచయితలు ఇటీవల నిర్వహించిన సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాల సమాహారంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. దేశంలో ఆహార భద్రత, కోవిడ్ తదనంతర పరిస్థితులు, గిరిజన ప్రజల్లో ఆహార భద్రత, అంతర్జాతీయ సంస్థల పాత్ర, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలపై ఆహార అభద్రత ప్రభావం తదితర అంశాలను ఈ పుస్తకంలో పరిశోధకులు చర్చించారు. అనంతరం మార్చి 22–23 తేదీలలో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు అండర్ స్టాండింగ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్ ఇండియా ఎమర్జింగ్ చాలెంజెస్ ఇన్ సోషల్ ఇక్లూజన్ సదస్సు బ్రోచర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలు సెస్ బకాయిలు చెల్లించాలి

జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

మహారాణిపేట: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు కార్మిక శాఖకు చెల్లించాల్సిన సెస్ బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం – వర్కర్స్ చట్టంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ రహదారులు, భవనాల శాఖ, జీవీఎంసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, గంగవరం పోర్టు, ఇతర ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన బకాయి సెస్ ఈ నెల 30లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా సెస్ చెల్లింపులు జరుగుతున్నాయని, అయితే అంతకు ముందు ఆమోదించిన భవన నిర్మాణాల వివరాలను కార్మిక శాఖ ఉప కమిషనర్ కోరగా, 2016 నుంచి 2018 వరకు గల వివరాలను ఈ నెలాఖరులోగా అందజేయాలని ఆదేశించారు. సచివాలయం పోర్టల్ ద్వారా ప్రభుత్వ భవన నిర్మాణాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని కార్మిక శాఖ ఉప కమిషనర్ జాయింట్ కలెక్టర్‌కు వివరించగా, ఇకపై రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత, సహాయ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి, డీపీవో ఎంవీఏ.శ్రీనివాసరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సీహెచ్.గణపతి, సహాయ కార్మిక అధికారులు పీటీవీ లవకుమార్, ఎస్.విజయ శ్రీ,, ఆర్ అండ్ బీ డీఈఈ కె.ఎస్.ఫణీశ్వర్, పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం జేసీకి జర్నలిస్టుల వినతి


జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట : జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాలకు సంబంధించి 60:40 నిష్పత్తిలో కాకుండా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఉచితంగా లేదా నామ మాత్రపు ధరకు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే స్టేట్ హెడ్ క్వార్టర్‌లో పని చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోవాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్‌పి) అధ్యక్షుడు పి.సత్యనారాయణ కోరారు. 2023లో అక్రిడేషన్ లేనప్పటికీ గతంలో కలిగి ఉంటే వారికి కూడా స్థలాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతోనూ, ఆ తర్వాత మరణించిన జర్నలిస్టుల తరఫున వారి కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలు తీసుకెళ్తామని, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. విశాఖ జిల్లా వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జీ.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, పాలాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు నీటితో భక్తులు జలాభిషేకం చేశారు. నూతన చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సొంత గనులతోనే స్టీల్‌ప్లాంట్ బలోపేతం

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సొంత గనులు కేటాయించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1028వ రోజు దీక్షలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను బేషరతుగా ఆపాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్ కొనసాగుతుందని నేరుగా ప్రధాని మోదీ ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించేందుకు జీవీఎల్ మోదీ ప్రభుత్వానికి దూతగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీక్షలో ఎస్.శ్రావణి, కె.కుమారి, కృష్ణారావు, శివ, వెంకటరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు



తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం – బ్రహ్మపూర్ – ఎర్నాకుళం మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

ఎర్నాకుళం – బ్రహ్మపూర్ (06087) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 27, ఫిబ్రవరి 3, 10, 17, 24న (శనివారాల్లో) ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 11.07 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ – ఎర్నాకుళం (06088) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 29, ఫిబ్రవరి 5, 12, 19, 26న బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 6.07 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ రైళ్లు 22 జనరల్ సెకండ్ క్లాస్, 2 సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల వినియోగించుకోవాలని వాల్తేర్ డివిజన్ అధికారులు కోరారు.

యూజీసీ నెట్ పరీక్షలో మజ్జిపేట ఉపాధ్యాయునికి ఫస్ట్ ర్యాంక్


ఉపాధ్యాయుడు ముగదాల అప్పలరాజును అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు ముగదాల అప్పలరాజుకు యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2023 – 2024 ప్రవేశ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ లభించింది. ఇతనికి 300 మార్కులకు 238 లభించాయి. చిట్టివలస కార్మికవాడకు చెందిన అప్పలరాజు తగరపువలసలో ఫర్ యువర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు. ఆర్థిక సమస్యల కారణంగా ఫీజులు చెల్లించుకోలేని, పుస్తకాలు కొనలేని విద్యార్థుల కోసం ఈ సొసైటీ స్థాపించారు. ఈ సందర్భంగా బుధవారం అప్పలరాజును సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బుల్లయ్య కళాశాలను సందర్శించిన కోస్ట్ గార్డ్స్


విద్యార్థులతో కోస్ట్ గార్డ్ బృందం

సీతంపేట: కోస్ట్ గార్డ్ 48వ రైజింగ్ డేలో భాగంగా బుధవారం ఐసీజీ జిల్లా నుంచి హైక్యూ–6 (ఏపీ) బృందం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాలను సందర్శించింది. కళాశాల విద్యార్థులతో బృంద సభ్యులు ముచ్చటించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్, దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో కోస్ట్ గార్డ్ పాత్ర, ఐసీజీ వ్యయం రక్షమాహ్ చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం


మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం 17వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 26వ రోజు 17వ వార్డులోని పెదవాల్తేర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి ఇంటి అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు దోహదం చేస్తున్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాలను విద్యా , సంక్షేమం, అభివృద్ధిలో దిశగా ముఖ్యమంత్రి జగన్ ముందుకు నడిపిస్తున్నారన్నారు. మరో పక్క రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి ఆయన నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

24 గంటల్లో ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు


లబ్ధిదారు బాషాకు ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: శస్త్ర చికిత్సకు డబ్బుల్లేక సతమతమవుతున్న ఓ కుటుంబానికి 24 గంటల్లో ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేసి సచివాలయ సిబ్బంది ఉపశమనం కల్పించారు. ప్రమాదంలో కాలు విరిగిపోతే శస్త్ర చికిత్సకు ఆరోగ్యశ్రీ కార్డు ఉండాలి లేదా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని చెప్పారు వైద్యులు. ఆరోగ్యశ్రీ కార్డు లేని ఆ పేద కుటుంబానికి ఏం చేయాలో తెలియక ఇంటికి వచ్చేసింది. తరువాత ఈ విషయాన్ని వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి కేవలం 24 గంటల వ్యవధిలోనే ఆరోగ్యశ్రీ కార్డును మంజూరు చేసి శస్త్ర చికిత్సకు మార్గం సుగుమం చేశారు. దీంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ 28వ వార్డు జాలరిపేటలో నివాసం ఉంటున్న షేక్ బాష రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల చిన్న ప్రమాదంలో కాలు విరిగిపోయింది. శస్త్ర చికిత్స చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా శస్త్ర చికిత్సకు ఆరోగ్యశ్రీ కార్డు ఉండాలని లేదా డబ్బులు చెల్లించాలని వైద్యులు చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు లేక, డబ్బులు చెల్లించలేక తిరిగి ఇంటికి వచ్చేశారు. ఈ విషయం కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి వెళ్లింది. ఆమె వెంటనే వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావును బాషా ఇంటికి పంపించారు. ఆయన సచివాలయం సిబ్బందితో మాట్లాడి మంగళవారం ఆరోగ్యశ్రీ కార్డు కోసం దరఖాస్తు చేయించారు. 24 గంటల పూర్తి కాకుండానే బుధవారం ఉదయానికే షేక్ బాషకు ఆరోగ్యశ్రీ కార్డు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ పత్రాన్ని దుర్గారావు తీసుకెళ్లి బాష కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే పలు నిత్యావసర సరకులు కూడా అందించారు. కార్డు త్వరగా మంజూరు కావడానికి కృషి చేసిన ఏఎన్ఎం పార్వతి, ఆశా వర్కర్ లక్ష్మి, సచివాలయం సిబ్బందిని దుర్గారావు అభినందించారు.

ఏయూ సమాచారం..

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలికా విద్య ప్రాముఖ్యత, వారి భద్రతకు సంబంధించిన అంశాలను చిన్నారులకు వివరించారు. ముందుగా దుర్గాభాయి దేశముఖ్ చిత్రపటానికి మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి, తదితరులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం బాలికా విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళా విద్యను ప్రోత్సహించడం, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా గత నాలుగున్నర సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. తల్లిదండ్రు లు, సమాజం గర్వించే స్థాయికి చిన్నారులు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది డాక్టర్ పి.ఉష, ఏయూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

వీసీకి ప్రముఖుల అభినందనలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఆచార్య ప్రసాదరెడ్డిని బుధవారం పలువురు ప్రముఖులు కలిసి అభినందనలు తెలిపారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.కుమార్‌రాజ, డాక్టర్ ఎ.మన్మోహన్, జాయింట్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్ వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ తదితరులు ప్రసాదరెడ్డికి అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కిడ్స్ క్రియేట్ పాఠశాల విద్యార్థులు కూడా వీసీని కలిసి తాము స్వయంగా గీసిన చిత్రాన్ని బహూకరించారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపులు

జాగ్రత్త వహించాలంటున్న అధికారులు


ప్రమాదకరమైన మలుపు


మొదటి మలుపు వద్ద ఏర్పాటు చేసిన కాన్వెక్స్ రోడ్డు మిర్రర్

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపైకి సందర్శకులు చేరడానికి ఘాట్ రోడ్డులో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ రోడ్ల ఏడు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఇవి వాహన చోదకులకు సమస్యగా మారాయి. దగ్గర మలుపులు కావడంతో వాహనాలను జాగ్రతగా నడపాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. సంక్రాంతి సందర్భంగా భారీగా పర్యాటకులు కై లాసగిరిని సందర్శించగా.. ఈ మలుపుల వద్ద పలు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా.. వాహనాలు దెబ్బతిన్నాయి. నిత్యం ఈ పర్యాటక కేంద్రం సందర్శకులతో రద్దీగా ఉంటుంది. కార్తీకమాసం, దసరా, సంక్రాంతి రోజుల్లో ఇక్కడ మరింత రద్దీ పెరుగుతుంది. కార్లు, మినీ బస్‌లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు మూడేళ్ల కిందట 1, 2, 4 నంబర్ల మలుపులు వద్ద సేఫ్టీ అద్దాలు(కాన్వెక్స్ రోడ్డు మిర్రర్)లను ఏర్పాటు చేశారు. ఇవి వాహనచోదకులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనచోదకులను గమనించుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారు. ఘాట్‌రోడ్డులో జాగ్రత్తగా వాహనాలను నడపాలని వీఎంఆర్డీఏ అధికారులను వాహనచోదకులను సూచిస్తున్నారు.